ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

శనివారం 7 సెప్టెంబరు 2024


చిలకలూరిపేట షరాఫ్ బజారులో సిద్ధం చేసిన గవ్వల గణపయ్య విగ్రహం

విఘ్ననాథా.. నమోస్తుతే

- జిల్లాకు వినాయక ఉత్సవ శోభ
- వర్షాన్ని లెక్కచేయకుండా ఏర్పాట్లు
- వాడవాడలా వెలిసిన గణనాథుల పందిళ్లు
- విగ్రహాలు, పత్రి విక్రయాలతో కూడళ్లు సందడి
- సత్తెనపల్లిలో 61 అడుగుల మట్టి మహా గణపతి




సత్తెనపల్లి గడియార స్తంభం సెంటర్‌లో పత్రి కొనుగోలు




చిలకలూరిపేట: మోడరన్ స్టార్ స్కూలులో కాయగూరల గణపతి

నరసరావుపేట(ఆంధ్రజ్యోతి), చిలకలూరిపేట సెప్టెంబరు 6: వర్షాలు వీడటం లేదు. కొన్ని ప్రాంతాల్లో వరదలు ముంచెత్తాయి. వినాయక చవితి సమీ పించేంది. ఈ సారి విఘ్ననాయకుడి చవితికి వాన గండం తప్పదని భావిం చారు. కానీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడ చూసినా సందడే.. సందడి. వర్షాలు.. వరదలను ఏ మాత్రం లెక్క చేయకుండా జిల్లావ్యాప్తంగా ఘనంగా వినాయక చవితి పర్వదినం జరుపుకు నేందుకు భారీగా ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా అంతటా గణపతి ఉత్సవ శోభ సంతరించుకుంది. పల్లెలు, పట్టణాలలో వినాయక చవితి కోలాహలం నెలకొంది. గ్రామాలు, మున్సిపల్ పట్టణాల నుంచి జిల్లా కేంద్రాలైన గుంటూరు, నరసరావు పేట, బాపట్ల వరకు వాడవాడలా చవితి పందిళ్లు వెలిశాయి. చిన్నారు లు నుంచి వృద్ధుల వరకు ఉత్స వాలలో ఉత్సాహంగా పాల్గొంటు న్నారు. సినీ సెట్టింగ్ తరహాలో పందిళ్లను అందంగా తీర్చిది ద్దారు. విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా పందిళ్లను శోభా యమానంగా అలంక రించారు. రంగురంగుల వస్త్రాలు, పూలు తదితరా లతో సుందరంగా అలం కరించారు. వినాయక మండపాలు విద్యుత్ కాంతులీను తున్నా యి. విగ్ర హ వేదికలను, మార్గాలను విద్యు త్ దీపాలతో శో భాయమానంగా అ లంకరించారు. కొన్ని దగ్గర్ల శుక్రవారం మధ్యాహ్నానికే భారీ విగ్రహాలను కూడా కొలువు దీర్చారు. సత్తెనపల్లి పట్టణంలోని నాగార్జుననగర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పర్యావరణ హితం, సామాజిక అభిమతం, మట్టి వినాయకుడిని పూజి ద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినా దంతో 61 అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బంక మట్టి, కొబ్బరిపీచు తదితరాలతో పర్యావరణా నికి ముప్పు లేకుండా ఈ విగ్రహాన్ని తయారు చేశారు. ఈ విగ్రహం ప్రజ లను ఎంతగానో ఆకట్టుకుంటుంది. చిలక లూరిపేట షరాఫ్‌బజార్ గణేష్ మహో త్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్షల బంగారు కోటింగ్ గవ్వలతో వినాయక విగ్రహాన్ని సర్వాంగ సుంద రంగా తయారు చేశారు. బంగారు గవ్వ ల గణపయ్య విగ్రహాన్ని తంజావూరు, కలకత్తా కళాకారులు రూపొందించారు.

ఆర్టిఫిషియల్ అమెరికన్ డైమండ్స్, కెంపులు, పచ్చలు, నీలాలు, ముత్యాలు, పగడాలతో అలంకరించారు. కేరళ, కర్ణా టక, తమిళనాడుల నుంచి వచ్చిన కళా కారులచే విద్యుత్ దీపాలంకరణ చేశా రు. విగ్రహం తయారీకి రూ.7 లక్షల వర కు వ్యయం చేసినట్లు సంఘ కన్వీనర్ పొట్టి వెంకట శివరత్నబాబు తెలిపారు.

గుంటూరు అరండల్‌పేట 11/1వ లైనులోని శ్రీ రమా సహిత సత్యన్నారా యణ స్వామి ఆలయ ప్రాంగణంలో 40వ(చత్వారింశ) గణేష్ నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహ కులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెనాలి లోని విజయవాడ రోడ్డులో 60 అడుగుల భారీ గణపతి విగ్రహానికి ముచ్చట గొలి పే విధంగా రంగులతో తీర్చిదిద్దారు. ప్రతి వీధిలోనూ భక్తులు గణనాథుడ్ని కొలిచేందుకు సిద్ధం చేశారు. నరసరా వుపేటలో వందల సంఖ్యలో భారీ విగ్ర హాలను విక్రయించినట్లు తయారీ దారు లు తెలిపారు. తయారీదారుల నుంచి విగ్రహాలను ఊరేగింపుగా నిర్వాహకులు మండపాలకు తరలించారు. శనివారం గణపతి పూజలకు పందిళ్ల వద్ద ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం సాయంత్రం భక్తులు గణపతి విగ్రహాలను దర్శించుకు నేందుకు వీలుగా కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసు శాఖ పటిష్ఠ బందో బస్తు ఏర్పాటు చేస్తున్నది. శుక్రవా రం కూడా పలు ప్రాంతాల్లో వర్షాలు పడగా తెరిపిచ్చిన సమయాన్ని నిర్వాహకులు వేడుకల పనుల కోసం కేటాయిస్తుం చారు. దీంతో జిల్లాలో శుక్రవారం ఎక్క డ చూసినా ఒకటే హడావుడి.. భక్తుల సందడి నెలకొంది. ఇక పలు ప్రాంతాల్లో మట్టిగణపతిని పూజిద్దాం పర్యావరణా న్ని పరిరక్షిద్దాం అనే నినాదాలతో కార్యక్ర మాలు జరిగాయి. విద్యార్థులతో మట్టి ప్రతిమల తయారీ పోటీలు, ర్యాలీలు కార్యక్రమాలు జరిగాయి. వివిధ శాఖ లు, సంస్థల ఆధ్వర్యంలో మట్టి గణప తుల విగ్రహాల పంపిణీలు విస్తృతంగా జరిగాయి. పందిళ్ల వద్ద వినాయక ఆలయాల్లో కూడా విఘ్నేశ్వర పూజ లకు అర్చకులు ఏర్పాట్లు చేశారు.




నరసరావుపేటలో కొలువుతీరిన భారీ గణపతి విగ్రహాలు


నరసరావుపేట క్లాత్ మార్కెట్‌లో ఉత్సవ మండపం


సత్తెనపల్లి : నాగార్జున నగర్‌లో 61 అడుగుల మట్టి వినాయకుడు

ప్రధాన రహదారులన్నీ కిటకిట

జిల్లాలోని ప్రధాన రహదారులన్నీ శుక్రవారం వినాయక విగ్రహాలు, పత్రి విక్రయ దుకాణాలు వెలిశాయి. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ రోడ్లపై ప్రతి మ లు తయారు చేసే వారు, పూజా సామ గ్రి, పత్రి, మామిడి ఆకుల విక్రయాలను చేపట్టేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. మధ్యాహ్నం వర్షం పడగా సాయం త్రానికి తగ్గడంతో ప్రజలంతా ఒక్కసారి గా రోడ్ల మీదకు రావడంతో మార్కెట్లు కిక్కిరిసిపోయాయి.


గణపతి భారీ విగ్రహాలను పూజలకు వాహనంలో తరలిస్తున్న భక్తులు

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

- దారి మళ్లింపులతో గంటల కొద్దీ ఆలస్యం
- మూడు చోట్ల క్రూ మార్పుతో ప్రత్యక్ష నరకం

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ఆగాయి.. అయినా ఇంకా రైళ్ల రాకపోకలు కొలిక్కిరాలేదు. కొన్ని రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నారు. దీంతో పలు రైళ్లు గంటలకొద్దీ ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. కేవలం గూడ్స్ రైళ్లను మాత్రమే ఇప్పటి వరకు నడుపుతున్న ఈ రూట్‌లో గత వారం నుంచి విజయవాడ వైపునకు వెళ్లాల్సిన రైళ్లను దారి మళ్లించి తీసుకొస్తున్నారు. దీంతో సాంకేతికంగా అనేక సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి. రాయనపాడు వద్ద వరదనీరు పట్టాల పైకి చేరుకుంటున్నదని ఈ ప్రత్యామ్నా యాన్ని రైల్వే శాఖ చేస్తున్నది. అయితే ఇది ప్రయాణికులను తీవ్ర అసౌకర్యానికి గురి చేయడమే కాకుండా 12 గంటలకు పైగా ఆలస్యంగా గమ్యస్థానాలకు రైళ్లను నడపాల్సిన పరిస్థితి తలెత్తుతున్నది. దాంతో రేక్ షేరింగ్ ఉన్న రైళ్లను రీషెడ్యూల్ చే యాల్సి వస్తున్నది. గురువారం అర్ధరాత్రి దాటాక హఠాత్తుగా సి కింద్రాబాద్ నుంచి కాజీ పేట మీదగా విజయవాడ వైపునకు వెళ్లాల్సిన రైళ్లను జగ్గయ్యపేట వద్ద నుంచి మోటుమర్రి, విష్ణుపురం, గుంటూరు మీదగా దారి మళ్లిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. అప్పటి వరకు రైలుని నడిపిన క్రూ(లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్, గార్డు) అక్కడ దిగిపోవాలి. అనంతరం మోటుమర్రి సెక్షన్‌లో గూడ్స్ రైళ్లను నడిపే క్రూతో విష్ణుపురం తీసుకురావాలి. ఆ తర్వాత విష్ణుపురం నుంచి విజయవాడ వరకు మరో క్రూని సమకూర్చాలి. విష్ణుపురం వద్ద గుంటూరు డివిజన్‌కు చెందిన క్రూ అందుబాటులో ఉండరు. నల్లపాడులో ఉన్న సిబ్బందిని అక్కడికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉత్పన్న మైంది. అలానే విష్ణుపురంలో ఎలాంటి క్యాటరింగ్ సదుపాయాలు కూడా ఉండవు. దీంతో గంటల తరబడి గోదావరి, మహబూబ్‌నగర్ - వైజాగ్, నా గర్‌సోల్ - నరసపూర్, గౌతమి, బీదర్ ఎక్స్‌ప్రెస్ లను నిలిపేయాల్సి వచ్చింది. కాగా రైళ్లకు వాట రింగ్ నింపే సౌకర్యం గుంటూరు, విజయవాడల్లో మాత్రమే ఉన్నది. పైన పేర్కొన్న రైళ్లలో నీళ్లు అయిపోవడంతో ప్ర యాణికులు టాయ్‌లెట్స్‌కు వెళ్లలేక నరకయాతన పడ్డా రు. దాంతో విష్ణుపు రం రైల్వేస్టేషన్‌లో శుక్ర వారం ఉదయం ఫలక్ నుమా ఎక్స్‌ప్రెస్‌కు అ డ్డంగా నిలిచి కాసేపు రైల్‌రోకో కూడా చేశా రు. అయినా ఎలాంటి ఫలితం లేకపోయింది. విష్ణుపురం - గుంటూరు సింగిల్ లేన్ రైలు మార్గం. ఈ రూట్‌లో ఇంటర్‌సిటీ, పల్నా డు, ఫలక్‌నుమా, వందేభారత్, జన్మ భూమి, రేపల్లె ఎక్స్‌ప్రెస్ వంటివి ప్రయాణిస్తాయి. వీటి సమయపాలన దెబ్బతినకుండా చూసు కుంటూ దారి మళ్లించిన వాటిని విజయవాడకు తీసుకెళ్లడం చాలా కష్టం. ఈ కారణంగానే పైన పేర్కొన్న రైళ్లన్ని 12 గంటల ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరుకున్నాయి. దాంతో నరసపూర్ ఎక్స్‌ప్రెస్‌ని నాలుగు గంటల పాటు రీషెడ్యూల్ చేయాల్సి వచ్చింది.




20 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

మరోసారి.. సాగర్ గేట్లెత్తారు

20 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, సెప్టెంబరు 6: నాగార్జున సాగర్ మళ్లీ తెరుచుకున్నా యి. గత వారం భారీ వర్షాలు.. శ్రీశై లం నుంచి పెద్దఎత్తున నీటి విడుదల తో సాగర్ గేట్లు పూర్తిగా తెరుచుకు న్నాయి. శ్రీశైలం నుంచి నీటి విడుదల తగ్గడం.. వర్షాలకు విరామం రావడం తో సాగర్ గేట్లు మూసేశారు. తాజాగా శుక్రవారం ప్రాజెక్ట్ 22 క్రస్ట్ గేట్ల ద్వా రా అధికారులు నీటిని విడుదల చేపట్టారు. 20 క్రస్ట్‌గేట్లను ఐదు అడు గుల మేర ఎత్తి 1,61,800 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపిస్తున్నారు. కుడి కాల్వ ద్వారా 8490, ఎడమ కాల్వ ద్వా రా 3035, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,339, క్రస్ట్‌గేట్ల ద్వారా 1,61,800, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600 మొత్తం ఔట్ ఫ్లో 2,04,064 క్యూసెక్కుల నీటిని వి డుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 2,04,064 క్యూసెక్కుల నీ రు వచ్చి చేరుతోంది.

అర్థాంతరంగా విద్యుదుత్పత్తి నిలిపివేత

రెంటచింతల: సత్రశాల వద్ద సా గర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజె క్టులో 2 యూనిట్ల ద్వారా అర్థాంత రంగా విద్యుత్ ఉత్పత్తిని నిలిపేసిన ట్లు ఎస్ఈ వెంకటరమణ తెలిపా రు. సాగర్ నుంచి అనూహ్యంగా వ రద నీరు వస్తుండడంతో 12 రేడి యల్ క్రస్ట్‌గేట్లను 2.5 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 2,15,600 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తున్నా మన్నారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.9861 ఎం.యూల విద్యుత్ తయారైందన్నారు. ప్రస్తు తం రిజర్వాయర్‌లో 75.06 మీటర్ల మేర నీరుండగా ఇది 7.02 టీఎంసీ లకు సమానమన్నారు.

గుంటూరు మీదగా సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ ప్రత్యేక రైళ్లు

10న శాస్త్రవేత్త నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానం

నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం

కేంద్ర మంత్రి పెమ్మసాని

6లో.

నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం



కొత్తూరులంకలో పంటలు దెబ్బతిన్నాయని కేంద్రమంత్రి పెమ్మసాని, మాజీ మంత్రి ఆలపాటికి చెబుతున్న రైతులు

కొల్లిపర, సెప్టెంబరు 6: వరద కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామనీ, అధైర్యపడవద్దని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన కొత్తూరులంక, అన్నవరంలంక, కనిగిరి లంక గ్రామాల్లో ఆయన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, సబ్‌కలెక్టర్ సంజనాసింహాతో కలిసి పర్యటించారు. వరదకు దెబ్బతిన్న పసుపు, అరటి, కంద, నిమ్మ, కూరగాయల పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రకృతి విపత్తు వల్ల తలెత్తిన నష్టాన్ని , పంటలపై పెట్టిన పెట్టుబడి, పంటబీమా, ప్రత్యామ్నాయ పంటలు తదితర అంశాలపై రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వరదల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించామని, రైతులు భారీగా నష్టపోయారన్నారు. వరద కారణంగా నష్టపోయిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయమే కాకుండా అడిషినల్ ప్యాకేజీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పంట నష్టం అంచనాలను వెంటనే తయారు చేయాలని అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. అన్నవరంలంక, కొత్తూరులంక గ్రామాల రైతులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. అన్నవరంలంక సమీపంలో వంతెనగాని, సప్టా గాని ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వ్యక్తిగతంగా ఉపశమనం ఉండే విధంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం ద్వారా అందరికీ న్యాయం చేయాలని చూస్తున్నట్లు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, బొల్లు యోగానందవర్ధి, తాతా అంజనేయులు, ఆలపాటి వెంకటేశ్వరరావు, పందిపాటి నల్లయ్య, భీమవరపు లంకకోటిరెడ్డి, సారథి, రవి, రమేష్, కౌసల్య, అప్పయ్య, వెంకట్రావు, శివన్నారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత అభినందనీయం

వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు చేయూత అందించడం అభినందనీయమని కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తూరులంక, అన్నవరంలంక గ్రామాల్లో వరద బాధిత కుటుంబాలకు రెడ్‌క్రాస్, రోటరిక్లబ్ అందజేసిన నిత్యావసర సరుకులను ఆయన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, సబ్‌కలెక్టర్ సంజనాసింహాతో కలిసి పంపిణీ చేశారు. వరద బాధితుల సహాయార్థం మండల పరిధిలోని వల్లభాపురం గ్రామానికి చెందిన దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు రూ.50వేల చెక్కును అందజేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వడ్లమూడి రవి, గుంటూరు రోటరీక్లబ్ అధ్యక్షుడు గాలి సుబ్బారావు, తెనాలి అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగ్గురి అరెస్టు : 8 బైకులు స్వాధీనం

చిలకలూరిపేట, సెప్టెంబరు 6: చిలకలూరిపేట అర్బన్ పోలీసులు ముగ్గురు బైక్ దొంగలను శుక్రవారం అరెస్టు చేసి వారి వద్ద నుంచి 8 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో చిలకలూరిపేటకు చెందిన కత్తి శివ, తన్నీరు ఉమాశంకర్, పెదనందిపాడుకు చెందిన ఒంటిపులి నరేంద్రబాబు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. చిలకలూరిపేట, యడ్లపాడు, బొప్పాడి, గణపవరం ప్రాంతాల్లో బైకులను దొంగిలించినట్లుగా పోలీసులు పేర్కొన్నారు. నిందితులు మూడు బైకులను అమ్మకం చేయడానికి సిద్ధంకాగా పోలీసులు పసిగట్టి వీరిని అరెస్టు చేశారు. అర్బన్ సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో ఎస్సై డి. చెన్నకేశవులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

విభిన్న రూపాయ.. వినాయక



పూల మొగ్గలతో గణపతి



బిస్కెట్లతో..

విగ్రహాల తయారీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట, సెప్టెంబరు 6: చిలకలూరిపేటలోని మోడరన్ స్టెల్లార్ స్కూలులో విద్యార్థులకు వినాయక విగ్రహాల తయారీ పోటీలను శుక్రవారం నిర్వహించారు. పర్యావరణానికి హాని కలగని పదార్థాలతో ఈ విగ్రహాలను తయారు చేయాలని విద్యార్థులకు సూచించారు. దీంతో పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. పూల మొగ్గలతో, మట్టితో, గోధుమ పిండితో, బియ్యపు పిండితో, బిస్కెట్లతో, అగ్గిపుల్లలతో, కాయగూరలతో, దారాలతో, కాగితపు కప్పులతో, వివిధ రకాల ఆకులతో, సహజ రంగులతో, పప్పు దినుసులతో వినాయకుని విగ్రహాలను తయారు చేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థ చైర్మన్ చేబ్రోలు మహేష్, ప్రిన్సిపల్ దేవులపల్లి ఫణి కుమార్ పాల్గొన్నారు.



మట్టితో..



కాగితంతో..



పూసలు, గొట్టాలు, సహజ రంగులతో..

డిసెంబర్‌లో విజ్ఞాన్‌లో అంతర్జాతీయ సదస్సు



పోస్టర్స్ విడుదల చేస్తున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 6: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో డిసెంబర్ 17, 18 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్, అపారి (ఆసియా పసిఫిక్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్స్), యూరోపియన్ ప్లాంట్ హెల్త్ రీసెర్చ్ అండ్ కోఆర్డినేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో "ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా : రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్" అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా అపారి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రవి ఖేతర్‌పాల్, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాక్వెలైన్ డీఆరోస్ హుగెస్, ఐసీఆర్ఏఎఫ్ వరల్డ్ ఆగ్రోఫారెస్ట్రీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవి ప్రభు, ఆంగ్రూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మిదేవి, డాక్టర్ వైఎస్ఆర్‌హెచ్‌యూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.గోపాల్, పీపీఏఐ ప్రెసిడెంట్ డాక్టర్ బి.శరత్‌బాబు హాజరవుతారని తెలిపారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

10న శాస్త్రవేత్త నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానం



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథబాబు, సుబ్రహ్మణ్యం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6: భారతదేశం గర్వించదగిన శాస్త్రవేత్త దివంగత యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానోత్సవం ఈ నెల 10న జరగనుందని కమిటీ చైర్మన్, టుబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు పేర్కొన్నారు. తెనాలిలో కుమార్ పంప్స్ ఆవరణలో శుక్రవారం అవార్డు ప్రదానోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 10న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో అవార్డు ప్రదానం జరుగుతుందన్నారు. తమిళనాడుకు చెందిన నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ప్రసన్నకుమార్‌ను అవార్డుకు ఎంపిక చేశామని చెప్పారు. గతంలో నాయుడమ్మ అవార్డును ఎంతోమంది సైంటిస్టులకు అందజేశారు. అవార్డు కమిటీ జ్యూరి విభాగం ఈ ఎంపిక చేసినట్లు చెప్పారు. నాయుడమ్మ జయంతి పురస్కరించుకుని పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. అవార్డు ప్రదానోత్సవంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా, చెన్నైకు చెందిన పీఎల్ఆర్ఐ సైంటిస్టు డాక్టర్ స్వర్ణకాంత్ పాల్గొంటారని చెప్పారు. కమిటీ వైస్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, అరవిందఘోష్ పాల్గొన్నారు.

లీవ్ లెటర్ రాసివ్వాల్సిందే.. లేదంటే రానట్టే

గుంటూరు, సెప్టెంబరు 6: బస్సుల్లేవు.. మీరంతా లీవ్ లెటర్లు రాసిచ్చి వెళ్లిపోండి.. ఇది గుంటూరు-1 , 2 డిపో అధికారులు వ్యవహరిస్తోన్న తీరు. శుక్రవారం కూడా అధికారులు ఇదేవిధంగా వ్యవహరించటంపై సిబ్బంది ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇటీవల వరదలతో ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఎన్నడూ లేనివిధంగా వరద నీరు ముంచెత్తిన విషయం తెలిసిందే. ఫలితంగా అనేక బస్సులు సాంకేతిక లోపంతో ఎక్కడికక్కడ మొరాయిస్తున్నాయి. బస్టాండ్‌లోని గుంటూరు-1, 2 డిపోల్లో అధికారుల వైఖరి కొత్త వివాదానికి దారితీస్తుంది. 30 సర్వీసులకు పైనే గ్యారేజ్‌లకే పరిమితమ్యాయి. అయితే విధులకు హాజరైన ఉద్యోగులకు డ్యూటీలు వేయకుండా డిపో అధికారులు లీవ్ లెటర్లు రాయమనటం వివాదాస్పదమవుతోంది. మూడు రోజులుగా ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో రెండు డిపోల్లోనూ ఇదే వ్యవహారం జరుగుతోందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిపోకు హాజరైన డ్రైవర్, కండక్టర్లును లీవ్ లెటర్లు రాసివ్వాలని లేదంటే మీరు రానట్లే లెక్కగా రాస్తామని కొందరు అధికారులు బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా డిపో అధికారుల వైఖరిపై కొందరు ఉద్యోగులు జిల్లా ప్రజా రవాణాధికారి రవికాంత్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులతో మాట్లాడతానని, సిబ్బంది నుంచి బలవంతపు లీవ్ లెటర్ తీసుకుంటే ఊరుకోమని ఆయన సమాధానం చెప్పినట్లు సమాచారం. అయితే ఇదే వ్యవహారంపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో ఉద్యోగులకు బలవంతపు లీవ్ అంటూ ఉప శీర్షికతో వెలువడిన కథనం ఆర్టీసీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే విధులకు హాజరైన డ్రైవర్, కండక్టర్స్‌లో కొందరు అధికారులు తమ అస్మదీయులకు మాత్రం హాజరు వేస్తున్నారంటూ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

ఈపూరు, సెప్టెంబరు 6: మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచినందుకు షాపు డీలర్ కె.శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు గురువారం రేషన్ షాపుపై దాడి చేయగా దండే సురేష్‌కు చెందిన గదిలో 36 బస్తాల రేషన్ బియ్యం ఉన్నాయి. ఆ బియ్యం బస్తాలు శ్రీనివాసరావు షాపు నుంచి అక్కడకు తరలించినట్లు గుర్తించారు. వీఆర్వో షేక్ అబ్దుల్ నబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దాడుల్లో వీఆర్‌ఏ జాన్‌సైదా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నకరికల్లు, సెప్టెంబరు 6 : ఎదురెదురుగా బైక్‌లు ఢీకొనటంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన పిడుగురాళ్ళ - ఓడరేవు రహదారిలో మాచవరం అడ్డరోడ్డు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నకరికల్లు గ్రామానికి చెందిన కండకుంట వెంకటేష్ బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా మరో బైక్‌పై నకరికల్లుకు చెందిన షేక్ బాజీ, రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి చెందిన సంగం కోటేశ్వరరావు ఎదురెదురుగా రావటంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నకరికల్లుకు చెందిన కండ్లకుంట వెంకటేష్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్ పై ప్రయాణిస్తూ తీవ్రంగా గాయపడిన సంగం కోటేశ్వరరావు, షేక్ బాజీ నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. నకరికల్లు ఎస్‌ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ అధికారులు, సిబ్బందికి రివార్డులు

గుంటూరు, సెప్టెంబరు 6: నాలుగు హత్యలు, మూడు హత్యాయత్నం కేసులను ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో ఈ ఏడాది జూన్ 13న గుర్తుతెలియని మహిళ మృదేహం కేసు, 2022లో ప్రకాశం జిల్లా మార్కాపురంలో సుబ్బలక్ష్మి (65) హత్య కేసు, తెనాలికి చెందిన నాగమ్మ (65) హత్య కేసు, తెనాలికి చెందిన పీసు అలియాస్ మోషె హత్య కేసు తోపాటు 2022 డిసెంబర్‌లో తెనాలిలో వలంటీర్ అన్నపూర్ణ, 2023లో తెనాలికి చెందిన మురుగప్ప వరలమది, 2023 తెనాలికి చెందిన షేక్ మీరాబీ హత్యాయత్నం కేసులను పోలీసులు ఛేదించారు. ఈ కేసుల్లో వెంకటేశ్వరి అలియాస్ బుజ్జి, ఆమె తల్లి రమణమ్మ ముద్దాయిలుగా తేల్చారు. కేసులను ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రశంసా పత్రాలు అందజేశారు. తెనాలి డీఎస్పీ బి.జనార్దన్ రావు, పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, సైబర్ సెల్ సీఐ షేక్ మౌలా షరీఫ్, చేబ్రోలు ఎస్సై దండా వెంకట కృష్ణ, తెనాలి త్రీటౌన్ ఎస్సై ఎస్.ప్రకాష్‌రావు, ఐటి కోర్ హెడ్ కానిస్టేబుల్ జి.బాలాజీ, ఐటి కోర్ కానిస్టేబుల్ ఎస్.శ్రీధర్, పొన్నూరు రూరల్ కానిస్టేబుల్ బీవీ శివయ్య, చేబ్రోలు కానిస్టేబుళ్లు ఏ. అప్పలనాయుడు, ఎస్.ధర్మరాజు, కె.రాము, డీసీఆర్‌బి జూనియర్ అసిస్టెంట్ పి శ్రీనివాసరావు రివార్డులు అందుకున్నారు.

గుంటూరు మీదగా సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ ప్రత్యేక రైళ్లు

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే పండగల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ - సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. నంబరు. 07027 సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ రైలు ఈ నెల, అక్టోబరు, నవంబరు నెలల్లో ప్రతీ శుక్రవారం రాత్రి 8.15కి బయలుదేరి 11.45కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.45కి గుంటూరు, శనివారం మధ్యాహ్నం 2.45కి బ్రహ్మపూర్ చేరుకొంటుంది. నంబరు. 07028 బ్రహ్మపూర్ - సికింద్రాబాద్ రైలు ఆయా నెలల్లో ప్రతీ శనివారం సాయంత్రం 4.45కి బయలుదేరి ఆదివారం వేకువజామున 4.30కి గుంటూరు, 5.23కి సత్తెనపల్లి, ఉదయం 11.35కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. పైన రెండు రైళ్లు 13 ట్రిప్పులు చొప్పున ప్రయాణిస్తాయి. కాగా నంబరు. 07097 సికింద్రాబాద్ - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల, అక్టోబరు, నవంబరుతో పాటు డిసెంబరులో మొదటి వారం వరకు ప్రతీ ఆదివారం సాయంత్రం 4.35కి బయలుదేరి రాత్రి 8.10కి సత్తెనపల్లి, 9.30కి గుంటూరు, సోమవారం ఉదయం 6.30కి విశాఖపట్టణం చేరుకొంటుంది. నంబరు. 07098 విశాఖపట్టణం - సికింద్రాబాద్ రైలు పైన పేర్కొన్న నెలల్లో ప్రతీ సోమవారం రాత్రి 7.50కి బయలుదేరి మంగళవారం వేకువజామునకు ముందు 2.25కి గుంటూరు, 3.20కి సత్తెనపల్లి, ఉదయం 11.15కి సికింద్రాబాద్ చేరుకొంటుంది.

ఇంటర్‌లాకింగ్ పనులతో రైళ్ల రద్దు

గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా గిద్దలూరు - దిగువమెట్ట మధ్యన నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా రైళ్లను రద్దు చేసినట్లు డీఆర్ఎం తెలిపారు. ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నంబరు. 17251 గుంటూరు - కాచీగూడ, 17228 గుంటూరు - డోన్, 12 నుంచి 21వ వరకు 17252 కాచీగూడ - గుంటూరు, 17227 డోన్ - గుంటూరు, 17 నుంచి 20వరకు 17261 గుంటూరు - తిరుపతి, 18 నుంచి 21 వరకు 17262 తిరుపతి - గుంటూరు, 17253 గుంటూరు - ఔరంగబాద్, 19 నుంచి 22 వరకు 17254 ఔరంగబాద్ - గుంటూరు రైళ్లను రద్దు చేశామన్నారు. నంబరు. 22831 హౌరా - శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం రైలుని ఈ నెల 18న కృష్ణాకెనాల్ నుంచే గూడూరు, రేణిగుంట మార్గంలో మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00



చంద్రవంక నది మ్యాపుని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మాచర్లటౌన్, సెప్టెంబరు 6: భారీ వర్షాలకు పట్టణంలో చంద్రవంక నది ఉధృతంగా ప్రవహించడంతో శుక్రవారం కలెక్టర్ అరుణ్‌బాబు పట్టణానికి విచ్చేసి జమ్మలమడక రహదారిలోని చంద్రవంక నది ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. నదికి ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని, నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని సూచించారు. ముంపు ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం తగు రక్షణ చర్యలు చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎత్తిపోతల జలపాతం సందర్శించారు. ఆయనతో గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, మాచర్ల తహసీల్దార్ జియాఉల్‌హక్, ఆర్ఐ నిమ్మల శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ హిమబిందు, మున్సిపల్ ఏఈ ఆదిత్య, సర్వేయర్ సాల్మన్‌రాజు ఉన్నారు.

చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో దొంగలు

● మహిళ మెడలో గొలుసు అపహరణ.. ఆందోళనలో ప్రయాణీకులు

దాచేపల్లి, సెప్టెంబరు 6: నడికూడి రైల్వే జంక్షన్ సమీపంలో ప్రయాణం చేస్తున్న చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాగేసుకున్న సంఘటన గురువారం రాత్రి జరిగింది. శుక్రవారం సేకరించిన వివరాల ప్రకారం.. చెన్నై - సికింద్రాబాద్‌కు వస్తున్న చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం రాత్రి 2 గంటల సమయంలో నడికూడి జంక్షన్ దాటిన తర్వాత ఎస్-9 బోగీలో ప్రయాణిస్తున్న ఇద్దరు ఓ మహిళల మెడలోని బంగారు గొలుసును లాక్కొని ట్రైన్‌లో చైనులాగి పరారైనట్లు సమాచారం. దీంతో బాధితులు సికింద్రాబాద్‌లోని జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర సరిహద్దుగా నడికూడి జంక్షన్ టార్గెట్ చేసుకొని రైళ్లలో దోపిడీకి పాల్పడుతున్నారు. గతంలోనూ ఇటువంటి దొంగతనాలు జరిగాయి. నడికూడి - పొందుగల మధ్యలో దొంగతనాలకు అనుకూలంగా వుండటంతో దొంగలు ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లుగా సమాచారం. కొద్దిరోజుల క్రితం నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో దొంగతనాలు జరిగినట్లు ప్రయాణీకులు ఆరోపిస్తున్నారు. గుడివాడ, ఒంగోలు ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఈ దోపిడీకి పాల్పడినట్లుగా భావిస్తున్నారు. ఈ విషయంపై విచారణ చేపడుతున్నట్లు రైల్వే సీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

20 నాటికి ఆక్రమణలు తొలగించాలి

రెంటచింతల, సెప్టెంబరు 6: మాచర్ల - గుంటూరు వెళ్లే రెంటచింతలలోని ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను ఈ నెల 20 నాటికల్లా తొలగించాలని, లేని పక్షంలో ప్రభుత్వమే ఆ పనికి పూనుకుంటుందని తహసీల్దార్ జీ కరుణకుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆర్ఐ డీ.కాంతారావు నేతృత్వంలో సర్వేయర్లు, పంచాయతీ సెక్రటరీ కోటేశ్వరావు తమ బృందంతో రహదారికి ఇరువైపులా రోవర్ ద్వారా కొలతలు తీసి హద్దులను స్థిరీకరించారు. ఇరువైపులా ఆర్‌సీఎం చర్చి ప్రహరీ గోడలే హద్దని స్పష్టం చేశారు. వైఆర్‌ఎస్ హైస్కూల్ నుంచి పెట్రోలు బంకుల వరకు ఆక్రమణలను వారికై వారే హుందాగా తొలగిస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు లింగయ్య, రేఖా, విఘ్నేష్, సర్వేయర్లు అర్జున్, రాజమోహన్‌రావు, నవీన్, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీలలో ఎస్ఐ సంధ్యారాణి తనిఖీ

సత్తెనపల్లి, సెప్టెంబరు 6: ఎస్పీ కే.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పట్టణంలోని హోటళ్లను, లాడ్జీలను పట్టణ ఎస్ఐ సంధ్యారాణి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీ చేశారు. హోటళ్ళలో రిజిస్టర్లను పరిశీలించారు. ఎవరైనా అనుమా నాస్పదంగా వ్యవహరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లాడ్జీ నిర్వాహకులకు సూచించారు. లాడ్జీల్లో, హోటళ్ళల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు కొనసాగినా సహించమని హెచ్చరించారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ : ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ ఎస్ఐ సంధ్యారాణి అన్నారు. పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు శుక్రవారం ఆమె కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటోడ్రైవర్లు అన్ని ధ్రువ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. నిబంనధలకు మించి ప్రయాణీకులను ఎక్కించుకోకూడదన్నారు. వేగంగా ఆటోలను నడప కూడదన్నారు. నిబంధనలు పాటించని ఆటోడ్రైవర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సంధ్యారాణి హెచ్చరించారు.

పాముకాటుతో రైతు మృతి

రాజుపాలెం, సెప్టెంబరు 6: పాముకాటుకు రైతు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. మండలంలోని కోటనెమలిపురి గ్రామానికి చెందిన బుర్రి నరసింహారావు(63) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం తను సాగుచేస్తున్న వరి పొలంలో పురుగు మందు కొడుతుండగా పాముకాటు చేసింది. దీంతో నరసింహారావు అక్కడికక్కడే మృతి చెందాడు. నరసింహారావుకి ముగ్గురు సంతానం ఉన్నారు.

రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వండి

మాచవరం, సెప్టెంబరు 6:రైతులకు అందుబాటులో ఉండి సాగు పద్ధతులపై సూచనలు, సలహాలు ఇవ్వాలని పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీ కృష్ణ దేవరాయలు సిబ్బందికి సూచనలు, సలహాలు తెలియ జేశారు. వాతావరణ ఆధారిత పంటలు, పంటల బీమా, ప్రధానమంత్రి పసల బీమా, పంట కోత ప్రయోగం తదితర అంశాలపై వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచనలు, సలహాలు తెలియ జేశారు. ప్రస్తుతం ఈక్రాపు బుకింగ్ జరుగుతుందని, వ్యవసాయ సహాయకులను సంప్రదించి పంటలను నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.



పోలేరమ్మ తల్లి విగ్రహానికి మొక్కుకుంటున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పోలేరమ్మ తల్లికి

ఎమ్మెల్యే ప్రవీణ్ పూజలు

క్రోసూరు, సెప్టెంబరు 6: గుంటూరు, కృష్ణా జిల్లాలతో సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భారీవర్షాల వలన ఇబ్బందులు పడుతున్న ప్రజలు త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం పోలేరమ్మ తల్లి, గంగమ్మతల్లి, అంకమ్మతల్లి దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. మండలంలోని హసానాబాద్‌లోశుక్రవారం గ్రామ దేవతల కొలుపులు నిర్వహించగా, ఎమ్మెల్యే ప్రవీణ్ హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అధిక వర్షాలతో ప్రజాజీవనం అస్తవ్యస్తమైందని, ప్రజలు అనేక బాధలు పడుతున్నారని, వారంతా త్వరగా కోలుకోవాలని అమ్మవార్లను కోరుకున్నట్టు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్థులు అమ్మవార్లకు బోనాలు సమర్పించారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గురజాల వారి కోర్టులో

I.P.No. 24/2024

పిటీషన్ :

శీర్థాల లింగయ్య .... పిటిషనర్

మరియు

కోనకంటి శ్రీనివాసరావు ఎలియస్ శ్రీను తండ్రి కోటయ్య, నివాసం : డో.నెం. 2-4, తాళ్ళపల్లి పోస్టు, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా వగైరాలు ... రెస్పాండెంట్స్

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పిటీషనర్ అయిన **శీర్థాల లింగయ్య**, తనను దివాళా తీసినట్లు ప్రకటించమని పైన చెప్పబడిన రెస్పాండెంట్స్ పై, పై నెంబరు ఐ.పి. **24/2024** కేసును పై కోర్టు వారి ఎదుట దాఖలు చేసినందున, ఇందు విషయమై యావన్మందికి తెలియజేయునది ఏమనగా మీకు పై కేసు విషయమై ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల శ్రీ కోర్టు వారి ఎదుట వాయిదా తేదీ అయిన ది.**18-09-2024**న హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరని యావన్మందికి ఎరుకచేయడమైనది. లేని ఎడల శ్రీ కోర్టు వారు పై నెంబర్ కేసులో మీ పరోక్షమున విచారించి తగిన నిర్ణయం తీసుకునుదరని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

వాయిదా తేది : 18-09-2024

ఇట్లు : యమ్. ప్రసాదరావు, పిటీషనర్ తరపు న్యాయవాది, గురజాల, సెల్ నెం : 9160267361

వరద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటాం

● ఎమ్మెల్యేలు జూలకంటి, కన్నా లక్ష్మీనారాయణ

మాచర్లటౌన్ / సత్తెనపల్లి, సెప్టెంబరు 6: వరద బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. విజయవాడలో వరద ముంపునకు గురైన సింగ్‌నగర్, చిట్టినగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. వరద బాధితుల సమస్యలను తెలుసుకొని ధైర్యం చెప్పారు. ప్రతి ఒక్కరినీ పరామర్శిస్తూ ఆహారాన్ని అందించారు. వరద ముంపునకు గురైన గృహాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ప్రభుత్వమే శుభ్రం చేయిస్తుందన్నారు. జరిగిన నష్టాన్ని అధికారులతో అంచనా వేయించి న్యాయం జరిగేలా చూస్తామని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి, పుల్లయ్య తదితరులు ఉన్నారు.



వరద బాధితులకు తాగునీరు అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

వరద బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతమైన 15వ డివిజన్‌లో నాలుగో రోజు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కన్నా పర్య టించారు. స్వయంగా బాధితుల వద్దకు వెళ్ళి పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయని, ఫైర్ ఇంజన్‌ల ద్వారా గృహాలను శుభ్రం చేయటం జరిగిందని కన్నా తెలి పారు. తెలుగు యువత వక్కంటి అంజయ్ కుమార్ కన్నా లక్ష్మీనారాయణ సూచనలతో 15వ డివిజన్‌లో 200 దుప్పట్లను వరద బాధితులకు అందించారు.

విమర్శించేవారు చిల్లి గవ్వ ఇవ్వలేదు

● ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత వారికి లేదు

కారంపూడి, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధిత సహాయక చర్యల్లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కనపడడం లేదని ఇష్టానుసారంగా మాట్లాడుతున్న వారు వరద బాధితుల సహాయార్థం వారి సొంత డబ్బు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని జనసేన సీనియర్ నేత ఎస్ఎంకే నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో విపత్తులు సంభవించినప్పుడు హెలికాప్టర్ పర్యటనలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి నేటికి వచ్చినట్లు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు వరద బాధితుల సహాయార్థం ప్రత్యక్షంగా ఎన్నో, పరోక్షంగా మరెన్నో చర్యలు చేపట్టారని అన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

దుర్గి, సెప్టెంబరు 6: విధుల్లో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పెషలాఫీసర్ సంజీవరావు అన్నారు. మండలంలోని అడిగొప్పుల, ధర్మవరం గ్రామాల్లోని సచివాలయాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రిజిష్టర్లను పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో గుప్త, సెక్రటరీలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

దాచేపల్లి, సెప్టెంబరు 6: గ్రామాలలో జ్వర పీడితులు గణనీయంగా పెరుగుతుండటంతో వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు వైద్యులు, సిబ్బంది ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తున్నారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మధు మాట్లాడుతూ.. ప్రజలు వారి పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలని, ఉపయోగంలో లేని వస్తువులను ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాలు తీసుకోవాలని సూచించారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

దాచేపల్లి, సెప్టెంబరు 6: గణేష్ నవరాత్రులలో భాగంగా ఏర్పాటు చేస్తున్న గణపతి పందిళ్లకు పోలీసుశాఖ అనుమతి తప్పనిసరిగా ఉండాలని దాచేపల్లి సీఐ గుత్తి వెంకటరావు తెలిపారు. శుక్రవారం దాచేపల్లిలో గణపతి విగ్రహాల ఏర్పాటు కమిటీ సభ్యులను పిలిపించి పలు అంశాల గురించి వివరించారు. ఇష్టానుసారంగా అనుమతులు లేకుండా గణపతి విగ్రహాలు ఏర్పాటుచేసి చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. డీజేకి అనుమతులు లేవని వివరించారు. వినాయక మండపాల వద్ద 5 ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేసుకోవాలని, బాణ సంచా కాల్చవద్దని తెలిపారు. ఎటువంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి వీలులేదని, మండపాల వద్ద ఎటువంటి వివాదాలు జరుగకూడదని సూచించారు. వినాయక నిమజ్జన సమయంలో పిల్లలు, వృద్ధులను అనుమతించరాదన్నారు. అనంతరం పలు అంశాలపై వివరిస్తూ ఎటువంటి ఉద్రిక్త వాతావరణం ఏర్పడితే కమిటీ వారిదే బాద్యత అని సిఐ వెంకటరావు స్పష్టం చేశారు.

42 విగ్రహాల ఏర్పాటుకు దరఖాస్తులు

ముప్పాళ్ళ, సెప్టెంబరు 6 : వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకొనేందుకు మండల ప్రజలు సిద్ధమయ్యారు. విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు మండపాలను కట్టి విద్యుత్ అలంకరణలను చేపట్టారు. మండలంలో 42 విగ్రహాల ఏర్పాట్లకు దరఖాస్తులు చేసుకున్నారని ఎస్ఐ సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. విగ్రహాల మండపాల వద్ద సీసీ కెమేరాలను నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

చెస్‌లో మెరిసిన తెలుగుతేజం

రెంటచింతల, సెప్టెంబరు 6: అండర్ 18 విభాగంలో శ్రీలంకలో ఈనెల 5న నిర్వహించిన చెస్ పోటీల్లో రెంటచింతలకు చెందిన పీ.అజయ్‌సంతోష్ బంగారు పతకంతోపాటు రూ. 75 వేల నగదును, ప్రశంసాపత్రాన్ని పొందాడు. ఏడు పాయింట్లకు గాను 6.5 పాయింట్లతో శ్రీలంకకు చెందిన ఏఏ కవిష్కగింషన్ లక్షరీపై గెలిచినట్లు చెస్ మేనేజర్ లుక్ష్మన్ విజయసూర్య చెప్పారు. గత నెల అబుదాబీలో నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచి ఈ ఏడాది అక్టోబరు 28 నుంచి నవంబరు 10 వరకు బ్రెజిల్‌లో జరిగే వరల్డ్ యూత్ చెస్ ఛాంపియన్‌కు ఎంపికయ్యాడు. అజయ్ సంతోష్ ఢిల్లీ నోయిడాలో రామాగ్య ఇంటర్నేషనల్ స్కూల్లో 9వ తరగతి చదువుతుండగా తండ్రి వెంకట మయూర్ అక్కడే సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు.

మొదలైన

చవితి సందడి

● గణేష్ నవరాత్రి ఉత్సవాలకు మండపాలు ముస్తాబు

సత్తెనపల్లి, సెప్టెంబరు 6: వినాయక చవితి సందడి మొదలైంది. వాడవాడలా యువకులు పోటీపడి మండపాలు ఏర్పాటుచేసి విగ్రహాలు పెట్టారు. చవితి పూజాసామాగ్రి కొనుగోళ్ళతో శుక్రవారం సాయంత్రం గడియారస్తంభం సెంటర్ కళకళలాడింది. పట్టణంలోని అన్ని వీధుల్లో వినాయక మండపాలు ఏర్పాటుచేశారు. శనివారం జరిగే వినాయక



మేళతాళాలతో వినాయకుడి విగ్రహాలను మండపాలకు తరలిస్తున్న యువత, భక్తులు



సత్తెనపల్లి పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ వద్ద వినాయక చవితి సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

చవితి వేడుకలకు భక్తులు సిద్ధమయ్యారు. తొమ్మిది రోజులపాటు ఈమహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు గణేష్ ఉత్సవకమిటీల ప్రతినిధులు సిద్ధమయ్యారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురామ్‌నగర్, తాలూకాసెంటర్‌లో డీఎన్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు వేల మట్టి వినాయక ప్రతిమలను ఫౌండేషన్ నిర్వాహకులు దరువూరి నాగేశ్వరరావు, టీడీపీ నేతలు పంపిణీ చేశారు.

క్రోసూరు: వినాయకుడి విగ్రహాలను మేళతాళాలు, బాణాసంచా మోతలు నడుమ యువత, మండపాలకు తరలించారు. క్రోసూరులో సుమారు 10 ప్రాంతాల్లోను, దొడ్లేరు, అనంతవరం, ఊటుకూరు, 88 తాళ్ళూరు గ్రామాల్లోను విగ్రహాలను నెలకొల్పారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

మాచర్లటౌన్, సెప్టెంబరు 6: పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. భోజనం నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. వర్షాలు పడుతున్నందున శుభ్రతను పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. భోజనం చేస్తున్న వారిని పలుకరించి భోజన నాణ్యతను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 6: మండలంలోని చెంచుకాలనీలో రంగం మునలయ్య అనారోగ్య కారణాలతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు శుక్రవారం గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నూన్సావత్ గోపినాయక్, రంగానాయక్, దుర్గారావు, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి విగ్రహం అందజేత

దుర్గి, సెప్టెంబరు 6: జిల్లాలో అత్యంత సమస్యాత్మక గ్రామమైన జంగమహేశ్వరపాడులో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ఎస్ఐ సుధీర్‌కుమార్ వినాయకుని విగ్రహాన్ని గ్రామస్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 52 వినాయకుని విగ్రహాలకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. అనుమతులు తీసుకోని వారు వెంటనే తీసుకోవాలని, సమస్యలు లేకుండా వినాయక చవితి నిర్వహించుకోవాలన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం

రెంటచింతల, సెప్టెంబరు 6: పర్యావరణ హితం సామాజిక అభిమతమని, మట్టి వినాయకుని విగ్రహాలను పూజించి పండుగ విశిష్టతను వివరిద్దామని టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ అబ్బిరెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రమైన రెంటచింతలలో ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు పేరం చెన్నారెడ్డి ఆధ్వర్యాన వరుసగా ఏడోసారి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

యూపీఐ చెల్లింపు పేర మోసం

ముప్పాళ్ళ, సెప్టెంబరు 6: మండలంలోని దమ్మాలపాడు మీ సేవా కేంద్రం, కిరాణా దుకాణం నిర్వాహకుడు ఫోన్ పే చెల్లింపు విషయంలో మోసపోయి రూ.30వేలు నష్ట పోయాడు. బాధితుడు విశ్వనాథంను తెలిపిన వివరాల ప్రకారం.. రైతు వేషంలో వచ్చిన యువకుడు తమది తొండపి గ్రామం అని, అత్యవసరంగా డబ్బులు అవసరమని, అతని బంధువులు ఫోన్ పే ద్వారా తనకు డబ్బు పంపి స్తారని బాధితుడు చెప్పారని, అనంతరం తనకు రూ 40 వేలు పంపించారన్నారు. అనంతరం తన వద్ద రూ.30 వేలు మాత్రమే నగదు ఉండగా, అవి అతనికి ఇచ్చి మిగిలిని రూ.10వేలకోసం సాయంత్రం రావాలంటూ చెప్పానన్నారు. ఇంతలో ఓమహిళ తనకు ఫోన్‌చేసి 'మీకు పొరపాటున రూ.40 వేలు ఫోన్‌పేలో పంపాను, తనకు తిరిగి రూ40 వేలు పంపించకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తాను' అని చెప్పి పోలీసులతో ఫోన్ చేయించి బెదిరించిందన్నారు. దీంతో తాను ఆ మహిళ నంబరుకి ఫోన్ పే ద్వారా రూ.40 వేలను వెనక్కి పంపానన్నారు. ఈ ఘటనలో తాను మోసపోయానని గ్రహించిన విశ్వనాథం శుక్రవారం పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 6: పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 70,178 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుండగా ప్రాజెక్టు 8 గేట్ల నుంచి దిగువకు 1,11,568, పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కు లు విడుదల

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వరద బాధితులకు అండగా టీడీపీ ప్రభుత్వం

● టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్


మద్దిరాల గంగాధర్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 6: వరద బాధితులకు అండగా తెలుగుదేశం ప్రభుత్వం ఉందని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వైసీపీ నాయకులు కొంతమంది ఇంకా ప్రజలను మోసం చేయాలని ప్రయత్నించడం బాధాకరం అన్నారు. చంద్రబాబునాయుడు ఇల్లు మునిగిపోయింది, రాజధాని మునిగిపోయిందని ఇంకా సిగ్గులేకుండా ప్రచారం చేసి, రాజధాని అమరావతి మీద విషం వెళ్లగక్కుతున్నారని అన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ చంద్రబాబునాయుడు, ప్రభుత్వ అధికారులు ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రయత్నిస్తు ఉంటే సాక్షి ఛానల్ లేనిపోని అపోహలు ప్రజలలో కలిగిస్తోందన్నారు. ఏ తుఫాన్ వచ్చినా, ఏ వరద వచ్చినా, ఏ రోజు ప్రజలను పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం అన్నారు. మాజీ సీఎం చెరువుల, కాల్వల పూడికలు తీయకుండా డ్రెయినేజీ వ్యవస్థను భ్రష్టుపట్టించిన విధానం కళ్ళకు కనబడుతున్నా అవేమీ పట్టదన్నట్టు ఇంకా సిగ్గు లేకుండా మాట్లాడుతూ వరదలను కూడా రాజకీయం చేస్తూ పబ్బంగడుపుకుంటున్నారన్నారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ ప్రజా అవసరాలను స్వయంగా చూసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని చూసి ఓర్వలేకపోతున్నారని అన్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నంతకాలం తాడేపల్లి ప్యాలెస్‌లో రాజభోగాలు అనుభవించాడే తప్ప ఏనాడు ప్రజలలో పర్యటించిన దాఖలాలు లేవని విమర్శించారు.

వరద బాధితులకు అండగా ఉంటాం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు


విజయవాడ వరద ప్రాంతాలలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేలు డాక్టర్ అరవిందబాబు, ప్రత్తిపాటి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 6: సాధారణ పరిస్థితులు వచ్చే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆకలి, దప్పులు లేకుండా అందరినీ ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం సితార సర్కిల్, కబేలా సెంటర్, చనమోలు వెంకటరావు ఫ్లైఓవర్ వరద ప్రాంతాలలో ట్రాక్టర్‌పై పర్యటిస్తూ ఎమ్మెల్యేలు పత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆహారం పంపిణీ చేశారు. వారితో పాటు ఎలక్ట్రిసిటీ జేఎం డీ కీర్తన, అన్నమయ్య జిల్లా ఎస్పీ వినయ్‌కుమార్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, కరిముల్లా తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు రూ.20,020 ఆర్థికసాయం


వరద బాధితుల కోసం రూ.20020 తహసీల్దార్ సురేష్‌కు అందిస్తున్న సేవా సమితి నాయకులు

వినుకొండ, సెప్టెంబర్ 6: వరద బాధితుల సహాయార్థం వినుకొండ మండలంలోని నడిగడ్డ గ్రామానికి చెందిన గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో రూ.20,020 రూపాయలను వినుకొండ తహసీల్దార్ సురేష్‌కు శుక్రవారం అందచేశారు. ఈసందర్భంగా బాధితుల సహాయార్థం విరాళాలను అందించి గాయత్రి సేవా సమితి నాయకులకు, సభ్యులకు తహసీల్దార్ కృతజ్ఞతలు తెలిపి, అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, వీఆర్వో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ మోడల్ పాఠశాలలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

రొంపిచర్ల, సెప్టెంబరు 6: మండలంలోని రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో మట్టి వినాయకుని ప్రతిమలను శుక్రవారం పంపిణీ చేశారు. మట్టితో వినాయకుని ప్రతిమలను తయారుచేసి పంపిణీ చేశారు. విద్యార్థులు పలురకాల అచ్చుల సాయంతో బొమ్మలు తయారుచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవినాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ...

చిలకలూరిపేట, సెప్టెంబరు 6: స్థానిక ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం 150 మందికి మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేశారు. పట్టణంలోని రజక కాలనీలో ఉన్న ఎంపీఎల్ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని, కార్యదర్శి ఎన్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేద అర్చకుడి కుటుంబానికి దాతల సాయం


కారుమంచిలో ఆర్థికసాయం చేస్తున్న బ్రాహ్మణసంఘం నేతలు

కారుమంచి (శావల్యాపురం) సెప్టెంబరు 6: వినుకొండ నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం, కారుమంచి గ్రామస్థుల సహకారంతో మండలంలోని కారుమంచి శివాలయంలో అర్చకుడిగా పని చేస్తూ ఇటీవల మృతిచెందిన పేటేటి నాగశ్రీరామ్మూర్తి కుటుంబానికి రూ.4లక్షల వ్యయంతో గృహనిర్మాణం చేయించారు. గృహనిర్మాణానికి బ్రాహ్మణ సంఘం తరఫున రూ.లక్ష, కారుమంచి గ్రామస్థులు రూ.3లక్షలను విరాళంగా సమర్పించారు. . గ్రామస్థులు పార్టీలకు అతీతంగా విరాళాలు సమర్పించి గృహనిర్మాణం పూర్తి చేశారు. బ్రాహ్మణ సంఘం తరపున ఇస్తామన్న రూ.లక్షను శుక్రవారం బ్రాహ్మణ సంఘం నేతలు గ్రామపెద్దలకు సమర్పించారు. బ్రాహ్మణ సంఘం నేతలు వీవీ సురేష్, రమణారావు, మాధవరావు, గాలి శ్రీనివాసరావు, ధూళిపాళ్ళ నాగేశ్వరరావు, పులిపాక హనుమంతరావు, గ్రామపెద్దలు యరమాసు కోటేశ్వరరావు, గోపాళం శివప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ తీరుపై రైతు నిరసన

ఈపూరు,సెప్టెంబరు 6: ఈపూరు తహసీల్దారు తీరుపై రైతు నిరసన తెలిపిన సంఘటన ఈపూరులో జరిగింది. తహసీల్దారు దురుసుగా వ్యవహరించటమే కాకుండా రైతులు, విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాడు. మండలంలోని ముప్పాళ్ళకు చెందిన రైతు కంచేటి చంద్రరావు చిట్టాపురం రెవెన్యూలో పొలం ఉంది. అందులో సాగునీటి కోసం రెండు బోర్లు వేయించాడు. ఆ బోర్లకు విద్యుత్ కోసం తహసీల్దారు సర్టిఫికెట్ అవసరమైంది. ఆ ధ్రువీకరణ పత్రం కోసం చంద్రరావు దరఖాస్తు చేసుకోగా విచారణ జరిపి, సర్టిఫికెట్ ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంపై రైతు చంద్రరావు శుక్రవారం తహసీల్దార్ కారుకు అడ్డంగా కూర్చొని నిరసన తెలిపాడు. తహసీల్దారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడకు ఎస్ఐ ఉమామహేశ్వరరావు వచ్చి రైతుకు సర్ది చెప్పి తహసీల్దార్ చేత సంతకం పెట్టించటంతో వివాదం సమసింది.

ఈ-పంట నమోదును నూరుశాతం పూర్తిచేయాలి

● మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామారావు


పిచికలపాలెంలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంఏవో రామారావు

శావల్యాపురం, సెప్టెంబరు 6: రైతులు సాగుచేసిన పంటలకు ఈ-పంట నమోదును వీఆర్వోలు, వీఏఏలు కలసి నూరుశాతం పూర్తిచేయాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామినేని రామారావు అన్నారు. మండలంలోని పిచికలపాలెంలో జరుగుతున్న ఈ-పంట నమోదును శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం గుంటుపాలెం, మతుకుమల్లిలోని రైతు సేవాకేంద్రాలను, వయకల్లు, కారుమంచిలోని సొసైటీ గోడౌన్‌లను సందర్శించి ఎరువుల నిల్వలను తనిఖీచేశారు. కారుమంచి స్టేట్‌బ్యాంక్‌లో మేనేజర్‌ను కలసి గుంటుపాలెం, వయ్యకల్లు, కారుమంచిలలో సీసీఆర్సీ కార్డులు పొందిన కౌలురైతుల జాబితాలను అందజేసి అర్హతున్న కౌలురైతులందరికీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. రామారావు మాట్లాడుతూ మండలంలోని 1800మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేశామని, బ్యాంక్‌ల ద్వారా కౌలురైతులకు రూ.6.10కోట్లు రుణాలు ఇప్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా కేటాయించిందన్నారు. మండలంలో 600 ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేయగా 400 ఎకరాలను ఈ-పంటలో నమోదు చేశామని, ఈకేవైసీని కూడా 90శాతం పూర్తి చేశామన్నారు.

గణపతి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

● భారీగా పందిళ్లు నిర్మాణం


బ్యాంక్ బజార్‌లో ఏర్పాటుచేసిన మండపం

నరసరావుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో గణపతి ఉత్సవాలకు భక్తులు విస్తృత ఏర్పాటు చేశారు. కాకుమాను వారి వీధి, క్లాత్ మార్కెట్, బ్యాంక్ బజార్‌లలో గణపతి ఉత్సవాలకు భారీగా పందిళ్ళను ఏర్పాటు చేశారు. వివిధ రకాల సెట్టింగ్‌లను నిర్మించారు. ఈ మూడు చోట్ల పోటాపోటీగా గణపతి ఉత్సవాలు జరగనున్నాయి. రామిరెడ్డిపేట, అరండల్‌పేట, బరంపేట, పాతూరు, ప్రకాష్ నగర్, పెద చెరువు, ఎన్‌జీవో కాలనీ, రెడ్డినగర్, కోటప్పకొండ రోడ్డు తదితర ప్రాంతాలు, అపార్ట్‌మెంట్‌లలో గణపతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు విస్తృత ఏర్పాట్లు చేశాయి. పందిళ్ళ వద్ద దేవతల భారీ విద్యుత్ కటౌట్‌లను ఏర్పాటుచేశారు. విద్యుత్ దీపాలతో ఉత్సవాల మండపాలను శోభాయమానంగా అలంకరించారు. వేలాదిమంది భక్తులు ఉత్సవ పందిళ్ళకు వచ్చి గణపతి విగ్రహాలను దర్శించుకొనేందుకు వీలుగా కమిటీలు ఏర్పాట్లు చేశాయి. గడియార స్తంభం, పల్నాడు రోడ్డు, స్టేషన్ రోడ్డులలో వినాయక విగ్రహాలు, పూలు, పండ్లు, పత్రి పెద్ద ఎత్తున విక్రయాలు జరిగాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసు శాఖ పట్టణంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నది.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 6: పట్టణంలోని శ్రీనివాస్ నగర్, సాంబశివరావుపేట కోటప్పకొండ రోడ్డు గణేష్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ చదలవాడ ఆదిత్య పాల్గొన్నారు.

100 వినాయకుని విగ్రహాల బహూకరణ

చిలకలూరిపేట, సెప్టెంబరు 6: పట్టణానికి చెందిన తెలుగుదేశం సీనియర్ నేత సింగు అజిత్ కుమార్ 100 వినాయకుని విగ్రహాలను శుక్రవారం గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులకు బహూకరించారు. చవితి మండపాలలో ప్రతిష్ఠించే నిమిత్తం వీటిని ఆయన రూ.2 లక్షలు వెచ్చించి సేకరించారు. నరసరావుపేట రోడ్డులో స్థానిక శాసనసభ్యులు, మాజీ మంత్రి ప్రతిపాటి పుల్లారావు సమక్షంలో ఈ విగ్రహాలను అందచేశారు.

గీతమ్స్ పాఠశాలలో...

వినుకొండ టౌన్, సెప్టెంబరు 6: పట్టణంలోని గీతమ్స్ పాఠశాల్లో వినాయక చవితి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మాలపాటి కోటిరెడ్డి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బురద రాజకీయాలు జగన్ మానుకోవాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, సెప్టెంబరు 6: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లండన్ పారిపోయేందుకు దారిలేక వరదల్లో విలవిల్లాడుతున్న బెజవాడ నగరంలో బురద రాజకీయం చేయడం దారుణమని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నాయకుడంటే ఆపదలో ముందుండి ప్రజలకు అండగా నిలవాలన్న స్ఫూర్తిని కూడా మరిచిపోయి లండన్ విహార్ యాత్రకు ఏర్పాట్లు చేసుకున్న వ్యక్తి జగన్ మోహరెడ్డి అని దుయ్యబట్టారు. కోర్టు కేసుల కారణంగా పాస్‌పోర్టు సీజ్ అయిన విషయం బయటకు రాకుండా విజయవాడకు వచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ పొద్దుపుచ్చుతున్న జగన్‌రెడ్డిని ఏమనాలో అర్థం కావడంలేదని జీవీ ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ వరదలు మానవ తప్పిదమని, ప్రభుత్వ సహాయక చర్యలు సరిగా లేవంటూ జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల ముఖ్యమంత్రిగా ఉండి 2014-2019 మధ్య చంద్రబాబు తలపెట్టిన ప్రాజెక్టులను, నాశనం చేయడం తప్ప జగన్‌రెడ్డి చేసింది ఏమిటని ఆయన ప్రశ్నించారు. వైసీపీ నేతల ఆక్రమణలు, కాలవ గట్లపై మట్టి తవ్వకాలు, నిషేధిత ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల వల్ల ప్రజలు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని తెలిపారు. ప్రస్తుతం విజయవాడ వరదలకు కారణమైన బుడమేరును గత ఐదేళ్లలో వైసీపీ నేతలు చేసిన ఆక్రమణలు, కొల్లేరు అనుసంధానం ప్రాజెక్టును అటకెక్కించడం వల్లనే ఇంతటి దారుణం జరిగిందన్నారు. ఈ తప్పిదాలకు విజయవాడ వరద బాధితులకు జగన్ క్షమాపణ చెప్పాలని జీవీ డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ప్రకాశం బ్యారేజీ గేటు ధ్వంసంచేసిన ఐదు పడవల్లో నాలుగు పడవలపై వైసీపీ రంగులు ఉండడం దేనికి సంకేతమో వైసీపీ నేతలే సమాధానం చెప్పాలని నిలదీశారు. బుడమేరు ఆనుకుని ఉన్న స్థలాలను కబ్జాచేసి, దొంగడాక్యుమెంట్లు సృష్టించి, అక్రమ లేఅవుట్లు వేసి గజం రూ.30వేలు నుంచి రూ.50వేలకు అమ్మింది జగన్‌రెడ్డి మనుషులేనని ఆయన గుర్తుచేశారు. వీటన్నిటికంటే మించి 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే బుడమేరు ఆధునీకరణ పనులను ఆపివేసి కమీషన్ల కోసం కాంట్రాక్టర్లను మార్చి, ఐదేళ్ల పనులు పూర్తి చేయకపోయినా అతడికి పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించడాన్ని ఏ తప్పిదం అనాలో కూడా జగన్ చెబితే బాగుంటుందని అన్నారు. 2022లో బుడమేరుకు గండిపడిందని రైతులు చెబితే ఎందుకు పట్టించుకోలేదో చెప్పాలని అన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ


వరద బాధితులకు విజయవాడలో సరుకులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 6: వినుకొండ నియోజకవర్గం టీడీపీ నాయకులు ఆధ్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు విజయవాడలో వరద ముంపు బాధితులకు శుక్రవారం దుప్పట్లు, ఆహారం, వాటర్ బాటిల్స్ లారీని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు జెండా ఊపి ప్రారంభించి, సరుకులను విజయవాడకు తరలించారు. విజయవాడలో విధుల్లో ఉన్న మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ బాధిత కుటుంబాలకు వీటిని అందచేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాదినేని ఆంజనేయులు, అయుబ్‌ఖాన్, షమీమ్‌ఖాన్, అంజిరెడ్డి, వెంకటేశ్వరెడ్డి, ఉమ్మడివరం సర్పంచి వీరగంధం ఆనంద్, గోవింద్‌నాయక్, చిరంజీవి, గోవిందరాజులు, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, డీసీ కొండలు తదితరులు పాల్గొన్నారు.

యువతిపై అత్యాచారయత్నం

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 6: పట్టణ శివారు ఎస్ఆర్‌కేటీ కాలనీలో వివాహితపై కొందరు యువకులు అత్యాచారానికి యత్నించారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి నెల్లూరు జిల్లా కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామానికి చెందిన ఓ వివాహతకు మాయమాటలు చెప్పి పిడుగురాళ్లకి చెందిన భాష అనే వ్యక్తి నరసరావుపేట పట్టణ శివారు ఎస్ఆర్‌ఐటీ కాలనీ చెందిన సాయి వారి మిత్రులు మహిళను నాలుగు రోజుల క్రితం పట్టణానికి తీసుకువచ్చారు. తిరిగి ఆ మహిళను నెల్లూరు బస్సు ఎక్కించే నెపంతో సాయి అనే యువకుడు ఆమెను తీసుకొనివెళ్తూ మార్గమధ్యలో కాలనీ వెనుక ఉన్న పొలాల్లోకి ఆమెను తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించారు. దీంతో ఆమె కేకలు వేయడంతో సమీపంలోని వారు రావటంతో నిందితుడు పారిపోయాడు. సమాచారం అందుకున్న ప్రజాసంఘాల నాయకులు సదరు మహిళను రూరల్ పోలీస్ స్టేషన్ తీసుకెళ్లారు. కాగా ఈ విషయమై రూరల్ సీఐ రామకృష్ణను వివరణ అడుగగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని సదరు మహిళతో ప్రజాసంఘాల నాయకులు స్టేషన్ వద్దకు వచ్చారని ఫిర్యాదు అనంతరం చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి రవి

ఈపూరు, సెప్టెంబరు 6: సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాఅధికారి బీ రవి అన్నారు. మండలంలోని ఊడిజర్ల, అగ్నిగుండాల, కొచ్చెర్ల గ్రామాలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాలువలలో పేరుకుపోయిన మురుగును తొలగించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఖాళీగా ఉండే పాత్రలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం కొచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ గ్రామస్థులకు దోమల నివారణపై వివరించారు. వీరితోపాటు డాక్టర్ డీ నాగేంద్రబాబు, ఎంపీహెచ్‌ఈవో సాంబశివరావు, ఎంఎల్‌హెచ్‌పీ రమణ నాయక్, ఏఎన్ఎం శాంతిబాయి,ఎంపీహెచ్ఏ శివకృష్ణవైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి: సీఐ

శావల్యాపురం, సెప్టెంబరు 6: వినాయచవతి పండుగను ప్రజలంతా వివాదాలకు దూరంగా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్‌రావు అన్నారు. శావల్యాపురం మండలం గంటవారిపాలెం సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద నిమజ్జన ప్రదేశాన్ని ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావుతో కలసి శుక్రవారం పరిశీలించారు. వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రదేశంలో బారికేట్లు, విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని, నిమజ్జనం సమయంలో ఎవ్వరూ కెనాల్‌లోకి దిగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐకి సూచించారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 6: పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురువారం జిల్లాలోని క్రోసూరు యడ్లపాడు మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించినట్లు ఎస్పీ కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. క్రోసూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రూ.5850విలువగల 38 మద్యం సీసాలు, మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని చెన్నైపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి వద్ద నుంచి 25000 విలువైన 22మద్యం సీసాలు 60 బీర్ సీసాలను సీజ్ చేసినట్లు ప్రకటనలో తెలిపారు.

కోర్టు ఆవరణలో మెడికల్ క్యాంప్

స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయస్థాన భవనాలు ఆవరణలో కంటికి సంబంధించి మెడికల్ క్యాంపు నిర్వహించారు. క్యాంప్‌ను మండల న్యాయ సేవాధి కార సంస్థ ఛైర్మన్ 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎన్ సత్యశ్రీ ప్రారంభించారు. పట్టణంలోని ఎంవీ రెడ్డి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎల్ సృజన సిబ్బంది కంటి పరీక్ష నిర్వహించి తమ సూచనలు సలహాలు ఇచ్చారు.

అగ్ని బాధితులకు శివశక్తి ఫౌండేషన్ సాయం

వినుకొండ, సెప్టెంబరు 6: మండలంలోని చాట్రగడ్డపాడులో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా కట్టుబట్టలతో మిగిలిన తమిశెట్టి నాగరాజు కుటుంబానికి శివశక్తిలీలా అంజన్ ఫౌండేషన్ సాయం అందించారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాలమేరకు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు శుక్రవారం వారికి ఈ సాయాన్ని అందజేశారు.

సీపీఐ ఆధ్వర్యంలో 20,500 ఆర్థికసాయం

వినుకొండటౌన్, సెప్టెంబరు 6: వరద బాధితుల సహాయార్థం సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలో విరాళాలను సేకరించి రూ.20,500 రూపాయలను పంపినట్లు పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ తెలిపారు.


నరసరావుపేటలో విరాళాల సేకరణ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 6: విజయవాడలో భారీ వర్షాలకు దెబ్బతిన్న వరద బాధితులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు అన్నారు. శుక్రవారం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నరసరావుపేట పట్టణంలో విరాళాలు సేకరించారు. సేకరించిన రూ.8వేల విరాళాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు.

కాలువలో పడి రైతు మృతి

ఇనుమెళ్ళ (ఈపూరు) సెప్టెంబరు 6: కాలువలో పడి రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని ఇనుమెళ్ళలో జరిగింది. కాసా రామకోటయ్య (62) గురువారం ఉదయం పొలంలో బహిర్భూమికి వెళ్లి ఎన్నెస్పీ కెనాల్‌లో పడిపోయాడు. మరోరైతు చింతల సాంబయ్య గమనించి బంధువులకు సమాచారమిచ్చాడు. కూచినపల్లి సమీపంలో శుక్రవారం రామకోటయ్య మృతదేహం లభించింది. ఈపూరు ఎస్ఐ ఉమామహేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతునికి భార్య నలుగురు పిల్లలు ఉన్నారు.

విదేశాల్లో చదువుకు రూ.లక్ష ఆర్థికసాయం


విద్యార్థికి చెక్కును అందజేస్తున్న పట్టణ సీఐ శోభన్‌బాబు, చందోలు నాగవాణి

వినుకొండ, సెప్టెంబరు 6: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక అవసరాల నిమిత్తం పట్టణానికి చెందిన అబ్దుల్ కలామ్ థెరిసా సేవా సొసైటీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చందోలు నాగవాణి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ చెక్కును వినుకొండ పట్టణ సీఐ శోభన్‌బాబు చేతుల మీదుగా విద్యార్థి పరంజ్యోతికి శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యూకేలోని బ్రిష్టల్ యూనివర్సిటీలో ఎం.ఎస్ పూర్తిచేసేందుకు సీటు సాధించిన పరంజ్యోతిని అభినందించారు. దాతృత్వంతో లక్ష రూపాయలను ఆర్థికసాయం చేసిన చందోలు నాగవాణిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ నాయకులు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 6: వినుకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 12 మంది ఉత్తమ ఉపాధ్యాయులను స్థానిక జాషువా కళాప్రాంగణంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి జఫ్రుల్లా రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండలో వారు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీ ఏరువ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థుల మృతి


చింతా కార్తీక్ (ఫైల్‌ఫొటో)

పొట్లూరు (శావల్యాపురం) సెప్టెంబరు 6: రాజమండ్రి సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శావల్యాపురం మండలం పొట్లూరు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి చింతా కార్తీక్ (19), శ్రీకాకుళంకు చెందిన రోణంకి ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పొట్లూరు గ్రామానికి చెందిన చింతా కార్తీక్ రాజమండ్రి సమీపంలోని ఇంజినీరింగ్ కళాశాల్లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం రాత్రి 9గంటల సమయంలో హోటల్‌లో టిఫిన్ చేసేందుకు కార్తీక్ స్నేహితులతో కలసి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో కార్తీక్ వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీ కొట్టడంతో కార్తీక్, అతని స్నేహితుడు ప్రవీణ్ (21) అక్కడికక్కడే మృతి చెందారు. చింతా వీరాంజనేయులు, రమాదేవి దంపతులకు కార్తీక్‌తో పాటు కుమార్తె ఉన్నారు. కార్తీక్ తల్లిదండ్రులు వ్యవసాయపనులు చేసుకొంటూ కార్తీక్‌ను చదివిస్తున్నారు. కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. యువకడి మృతితో పొట్లూరులో విషాదఛాయలు అలుముకొన్నాయి. కార్తీక్ మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం రాత్రికి స్వగ్రామమైన పొట్లూరుకు తరలించనున్నట్లు స్థానికులు తెలిపారు.

8 మంది జూదరుల అరెస్టు

యడ్లపాడు, సెప్టెంబరు 6:మండలంలోని తిమ్మాపురం గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్న 8 మంది జూదరులను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ బాలకష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపురం పరిధిలోని తిరుమల నూలుమిల్లు ఎదురుగా గల పొలాల్లోని షెడ్డులో కొందరు పేకాడుతుండగా దాడి నిర్వహించి కోతముక్క ఆడుతున్న 8మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14,770 నగదును స్వాధీనం చేసుకున్నారు.

180మంది విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిమ్మాపురం (యడ్లపాడు), సెప్టెంబరు 6: మండలంలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. 39వ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో 180మంది విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వైద్యులు డాక్టర్ శివరామసుబ్బారావు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో నలుగురికి కళ్లజోళ్లకు సిఫార్సు చేసి, వాటిని ఉచితంగా ఇవ్వనునట్లు తెలిపారు.